# దిబ్బ రిపోర్ట్

దిబ్బ రాజావారు అమెరికా నుంచి తిరిగి రాగానే వారి దర్శనం చేసుకునే మహాభాగ్యం నాకు లభించలేదు. నేనప్పుడు మన ప్రాంతాల జరగనున్న ఎన్నికల సన్నాహాలు కవర్ చేస్తూ ఉంటిని. కవర్ చేశానంటే అంతా కప్పి పెట్టాననుకోకండి; కొంతే కప్పెట్టాను. కవర్ చేసేది కవర్ చేసి, అన్ కవర్ చెయ్యవలసినది అన్‌కవర్ చేసి, అనేక విషయాలు డిస్కవర్ చేశాను. డిస్కవర్ చేసినదాంట్లో చాలా భాగం కవర్ చేసి, బహు కొంచెం అన్‌కవర్ చేసి, మొదట్లో కవర్ చెయ్యలేకపోయినది చివరకు ఎలాగైతేనేం రికవర్ చేసుకున్నాను. అదంతా పోనివ్వండి.

రాజావారి దర్శనం కోసం దిబ్బ చేరగానే నాకు తెలియవచ్చింది ఎలెక్షన్ వివరాలు. దిబ్బలో పదమూడు ఎసెంబ్లీ స్థానాలూ మూడు రాజ్యసభ స్థానాలూ ఉన్న సంగతి అందరికీ తెలిసినదే.

ఎసెంబ్లీ స్థానాలకు ఇరవై అయిదు పార్టీల వాళ్ళూ, నలభై అయిదుగురు స్వతంత్రులూ పోటీ చేశారు. దిబ్బలో కిందటి ఎలెక్షనుకు పదమూడు పార్టీలే ఉండేవి. అందులో రాజావారి పార్టీ తప్ప మిగిలినవన్నీ రెండేసి అయాయి. కాని అందరూ పాత ఎలెక్షను చిహ్నాలే కావాలని పట్టుపట్టారు. అందుచేత చిహ్నాలను చీల్చటం జరిగింది. మాటవరసకు తేలు చిహ్నం రెండు చేసి, తోకలేని తేలు ఒకరికీ, కొండు ఉన్న తోక ఒకరికీ ఇచ్చారు. అరటిచెట్టు చిహ్నాన్ని బోదె కిందా, గెలకిందా ఊడగొట్టారు. పెద్దనోరు చిహ్నాన్ని బోసినోటి కిందా, కట్టుడు పళ్ళ కిందా విడగొట్టారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులందరూ ఇళ్ళు కట్టించుకుంటూ ఉండటమూ, కార్లు కొంటూ ఉండటమూ, పొలాలు కొంటూ ఉండటమూ నేను చూశాను. ఒక గెలిచిన వాడింట వారంగా అందరూ పస్తులుంటున్నారుట. తనకు మంత్రిపదవి రాకపోతే దిబ్బ చెరువులో దూకెయ్యటం తప్ప మరోదారి లేదని చెప్పుకుని నా దగ్గిర ఏడిచాడు. భారతయుద్ధం తరవాత పాండవులకు అదే గతి పట్టిందని చెప్పి అతన్ని ఊరడించాను.

అన్నిటికన్న చిత్రమేమిటంటే ఒకే ఒక నియోజకవర్గంలో మూడే వోట్లు పడ్డాయి. రెండు వోట్లు తెచ్చుకున్న వాడుగెలిచాడు. ఒక్కవోటు తెచ్చుకున్నవాడు డిపాజిట్టు పోనందుకు

సంతోషించాడు. ఈ అపూర్వ సంఘటన వెనక నక్సలైట్ అదృశ్య హస్తం ఉండి ఉంటుందని అధికార్లు అనుమానిస్తున్నారు. ఆ నియోజకవర్గంలో ఎవరిని అడిగినా వోటు వేశామని చెప్పి సిరాగుర్తులు చూపిస్తున్నారు.

సిరాగుర్తు లేనివాడు వోటుచెయ్యలేదని చెప్పవచ్చుగాని, గుర్తు కలవాడు వోటు చేసినట్టు చెప్పలేం గదా! అన్నారు మహామేధావి అయిన దివాన్జీ గారు. గొప్ప సత్యం. బ్రైస్ కూడా ఈ సత్యాన్ని కనిపెట్టలేదు.

రాజ్యసభ ఎన్నికల మాట చెప్పనవసరం లేదు. రాజాగారి పార్టీ వాళ్ళు గెలవటమే గాక మిగిలిన అందరికీ డిపాజిట్లు పోగొట్టారు.

"ప్రతాపం నాది కాదు, ఆ ఇందిరాదేవిది!" అన్నారు రాజావారు మోడెస్ట్‌గా.

రాజ్యసభ ఎన్నికల సందర్భంలో రెండు మూడు బూత్‌లలో వోటర్ల సంఖ్యకన్న హెచ్చు వోట్లు పడ్డట్టు పుకారు లేచింది. లెక్కించటం తప్పయి ఉంటుందనీ, లెక్కించిన వాళ్ళలో కొందరికి ఒంట్లు కూడా సరిగా రావనీ, అసలు ఎక్కువ వోట్లు పడ్డాయన్నది ప్రతిపక్షాల కల్పన అనీ అధికారవర్గాలు అంటున్నాయి.

కొందరు తాగేసి ఆనంద పారవశ్యంలో వోటు వెయ్యటం మరిచారు. లేకపోతే ఇంకా ఎక్కువ వోట్లు పడాలిసింది అన్నాడొక ఎల్డీసీ. అతన్ని పై అధికార్లు చివాట్లు పెట్టినట్టు విన్నాను.

❀ ❀ ❀ ❀ ❀

వోటర్లలో సగంమంది కూడా వోటు చెయ్యకపోవటానికీ, కొన్ని చోట్ల బొత్తిగా నూటికి అయిదుగురే వోటు చెయ్యటానికి నక్సలైట్ల ప్రభావం కారణమై ఉంటుందా, అని ఒక పెద్ద భూస్వామిని అడిగాను.

"ఏమోనండీ, మరీ! అయినా దిబ్బలో విప్లవం రావటమేమిటి లెండి? కల్లో కూడా అనుకోవటానికి వీల్లేదు. అయినా మనం ఏమరి ఉండటానికి వీల్లేదు. చూశారో లేదో, విప్లవం రావటానికి ముందు విప్లవ సాహిత్యం వస్తుంది – ఉరుముకు ముందు మెరుపొచ్చినట్టు. సూర్యుడికి ముందు అరుణోదయం అయినట్టు. అందుచేత, నేనే స్వయంగా చిన్న పరిశోధన ఆరంభించాను. ఇద్దరు బియ్యేలకు నెలజీతం ఏర్పాటుచేసి, హింసా ప్రచారం గల పుస్తకాలు ఎక్కడున్నదీ చూసి కొనుక్కు రమ్మన్నాను. పుస్తకం ఖరీదే గాక ప్రతి ఒక పుస్తకానికీ పదేసి రూపాయల చొప్పున బహుమతి కూడా ఇస్తానన్నాను. ఆ పుస్తకాలు రాసినవాళ్ళ పేర్లూ, ఎడ్రసులూ తెస్తే మరో అయిదు రూపాయలిస్తానన్నాను" అన్నాడు భూస్వామి.

“మీరు రహస్యంగా చేసే దేశసేవ నేనెరగనా? జాతీయోద్యమం రోజుల్లో మీ పాత్ర గురించి ఎంత అన్వేషించినా నాకు ఒక్క పిసరు సాక్ష్యం దొరికింది కాదు!” అన్నాను.

నేను మెచ్చుకోవటం అయిపోయిందని రూఢి చేసుకుని భూస్వామి ఇలా అన్నాడు.

“అప్పుడేమయిందనుకున్నారు. పాత పురాణాలన్నీ దిగాయి! రామాయణం! నేనిన్నాళ్ళూ గుర్తించలేదు రాముడెంత హింసాపరుడండీ! సీత హింస మానమంటే చివాట్లేశాడు. వాలిని అలా చంపటం పచ్చి గొరిల్లా పద్ధతి! భగవద్గీత! దానిలోనూ హింసే. విష్ణుమూర్తీ, ఇంద్రుడూ, పాండవులూ, కృష్ణుడూ వధలు చెయ్యటంలో ఎవరికీ తీసిపోరు. శైవగ్రంథాల నిండా హింసే. నేను పురాణాలు చదవకపోవటం పొరపాటయింది. ఇద్దరు బియ్యేలకు ఒక నెలజీతం ఇచ్చుకోవటమే గాక రెండు వందలు బహుమానాల కింద ఇవ్వవలిసొచ్చింది. ఆ డబ్బు పోనివ్వనులెండి. మన పురాణాలన్నీ అహింసకు అనుకూలంగా తిరగరాయించి పదేసివేల కాపీలు అచ్చు వేయించి, దేశంలో ఉన్న లైబ్రరీలన్నిటికీ అమ్మిస్తాను. ఎకాడమీ ఎవార్డులూ, అదేదో లక్ష రూపాయల బహుమతి ఉందే అదీ కొటెయ్యాలి.

“ఇంకో చిత్రం చూశారా? ఈ బియ్యేలు నాకన్నా శుం.... తెలివితక్కువ వాళ్లు. భగవద్గీత తెచ్చినవాడు ఒక స్వాములవారి పేరూ అడ్రసూ తెచ్చాడు. దానిమీత ఆయన పేరున్నది. మరి అలాగే శివపురాణం తెచ్చినవాడు ఎవరో శాస్త్రులుగారి పేరూ ఎడ్రసూ తెచ్చాడు. డబ్బిచ్చుకున్నాడు. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది.”

నేను ఊరుకోక, “పురాణాలను అహింసగా రాయడం కష్టమేమో” అన్నాను.

“అదేం లేదు. రాముడిచేత చచ్చినవాళ్లంతా ఆత్మహత్య చేసుకున్న వాళ్లేనని చెప్పొచ్చు. డెత్‌విష్ అనే మాట విన్నారా?” అన్నాడు భూస్వామి.

విన్నట్టు జ్ఞాపకం లేదు.

అటువంటిది ఉన్నదిలెండి. అదికాకపోతే కాలపురుషుడున్నాడు. శాపాలున్నాయి. మన సంస్కృతిలో దేన్ని సమర్థించటానికైనా మార్గం ఉన్నదండీ. భగవద్గీతలో చెప్పాడు గదండీ ‘నిమిత్తమాత్రం భవ’ చంపేదెవరు? చచ్చేదెవరు?”

“ఇది నక్సలైట్లకు వర్తించదనుకుంటాను?” అన్నాను.

“వర్తించదు. వాళ్లు భగవద్గీతను నమ్ముతారా? నమ్మరు. మరేదో ఎర్ర పుస్తకాన్ని నమ్ముతారు. దాన్నిండా హింసే. మీరు చదివారా ఎర్రపుస్తకాన్ని?”

“లేదు” అన్నాను.

“నేనూ చదవలేదు. అలాటి పుస్తకాలకేసి చూడను కూడా చూడను” అన్నాడు భూస్వామి.

❀ ❀ ❀ ❀ ❀

ఎలాగైతేనేం, అనుకున్న దానికన్న ఆలస్యంగా, రాజావారి దర్శనభాగ్యం లభించింది. శ్రీవారికీ ప్రయాణం సుఖంగానే జరిగిందట. లేదు, వారు అమెరికా అధ్యక్షుణ్ని గాని, ఉపాధ్యక్షుణ్ని గాని కలవలేదు. (కలిస్తే పత్రికలలో పెద్దగా వేసి ఉండేవారే గద!)

అమెరికా అంతర్జాతీయ ఖ్యాతి దెబ్బతింటున్నదంటున్నారు. నిజమా అని అడిగాను.

"ప్రపంచాధిపత్యం కావాలంటే కొంత అపఖ్యాతికి గురికావటానికి తయారు కావాలి. ఈమాట చర్చిల్ అమెరికాకు ఏనాడో చెప్పాడు – అనుభవం గల సామ్రాజ్యవాది గద! ఆ సలహా ప్రకారమే అమెరికా పాలకులు నడుచుకుంటున్నారు" అన్నారు రాజావారు.

"అమెరికా ఆర్థిక పరిస్థితి అంత బాగా లేదంటున్నారు, నిజమా?"

"ఎవరికి బాగు? ఏ విధమైన బాగు? ద్రవ్యోల్బణం జరుగుతున్నది. డబ్బుకు కొనుగోలు శక్తి తగ్గితే పరిమిత ఆదాయాలు గలవాళ్లు ఇబ్బంది పడవచ్చు. కాని అమెరికాకు వెన్నెముకలాగా ఉన్న యుద్ధ పరిశ్రమలకు భయం లేదు. ద్రవ్యోల్బణం ఉన్నది గనక, సహజంగా ఆ పరిశ్రమలు తమ లాభాలను పెంచుకోవాలని చూస్తాయి. పెంచుకుంటాయి. ఏమిటి నష్టం? భారీ పరిశ్రమలు నష్టపడనంత కాలమూ దేశానికి నష్టం లేనట్టే" అన్నారు శ్రీవారు.

యుద్ధం విషయం అడిగాను. "అమెరికాలో యుద్ధ వ్యతిరేకత హెచ్చుతున్నదిట గదా?"

"యుద్ధం చేద్దామా, వద్దా అని సైనికుణ్ని అడిగితే, వాడు వద్దనే అంటాడు. చావటం ఎవరికీ ఇష్టం ఉండదు. సైన్యంలో చేరవలిసి వచ్చినవాళ్లూ, చచ్చినవాళ్ల బంధువులూ యుద్ధ వ్యతిరేకులే" అన్నారు శ్రీవారు.

"ఆసియాలో అమెరికా చాలా నష్టం కలిగించడమే గాక నష్టపోతున్నట్టు స్పష్టం. లక్షలకొద్దీ టన్నుల బాంబులూ, వందలకొద్దీ విమానాలూ కూలిపోవటం ఎంత నష్టం?"

"నువ్వింకా దొడ్డిదారినే ఉన్నావు. ఉత్పత్తిదార్లు సరుకు తయారు చేసేది ఖర్చుకావటానికి కాదా? ఎన్ని విమానాలు కూలిపోతే విమానాల కంపెనీలకు అంత గిరాకీ! ఎన్ని బాంబులు పేలిపోతే బాంబులు తయారుచేసే వారికి అంత లాభం. బాంబులు వెయ్యటానికి జాగా దొరక్కపోతే వాటిని సముద్రంలో వేసవచ్చిన అమెరికను యుద్ధవిమానాలను గురించి నువు వినలేదా? అమెరికా రక్షణ శాఖ ఏమీ పేచీపెట్టలేదే యుద్ధం పేరుతో ఎన్ని నిర్మాణాలు ప్రారంభించి, కోట్ల కొద్దీ డాలర్లు ఖర్చుచేసి, మధ్యలో విరమించారో నీకేమన్నా ఆడియా ఉన్నదా? యుద్ధ పరిశ్రమలకు అదొకరకం లాభం! పంధొమ్మిదో శతాబ్దపు ఆలోచనా ధోరణితో అమెరికాను అర్థం చేసుకోవటం అసంభవం. అది అప్ టు డేట్ దేశం!" అన్నారు రాజావారు.

"వియత్నాం పౌరులను అకారణంగా కాల్చి చంపినందుకు ఎవరినో విచారణ చేస్తున్నారటగా?"

"వొట్టి చాదస్తం! ఏషియన్ల చేత ఏషియన్లను చంపించటం ఒక పాలసీగా అమెరికాలో ఏనాడో రూపొందింది. అమెరికా ఆధిపత్యానికి ఏషియన్లు చావటం ప్రధానం. అమెరికన్లు మరీ జాస్తిగా చావకుండా ఉండటం కూడా ప్రధానమే. వియత్నాం, కాంబోడియా, లావోస్ యుద్ధాలన్నీ ఈ పంపినీ మీదే గద జరుగుతున్నాయి? నాపాం బాంబులు వేసి చంపితేనేం? డిఫోలియంట్స్ చల్లి చేమలూ తగలబడితేనేం? ఇళ్లకు నిప్పంటించి బయటికి పారివచ్చే ముసలీ, ఆడా, పిల్లా పీచులను గుండేసి కొట్టి చంపితేనేం? మైవై హత్యలు చిన్న స్కేలు మీద వియత్నాం యుద్ధాలే! ఈ విచారణలు కేవలమూ ఫార్సు!" అన్నారు శ్రీవారు.

"అమెరికా ఆశయం ఆసియాలో కమ్యూనిజమును నిరోధించటం కాదా?"

"నీకు అంతర్జాతీయ రాజకీయాలు బొత్తిగా తెలీవన్నమాట! రష్యాలోనూ, తూర్పు యూరపులోనూ, చీనాలోనూ, ఇంకా ఇతర చోట్లా ఏదో విధంగా కమ్యూనిజం ఉన్నది. కమ్యూనిజమును నాశనం చెయ్యడమే అమెరికా ఆశయమైతే అమెరికా ఈ అన్ని దేశాల మీదా యుద్ధం చెయ్యవచ్చు. కమ్యూనిజమును నిర్మూలించటానికన్న నిరోధించటానికి ఎక్కువ ఖర్చవుతుంది. అమెరికాలో ధనికులకు కావాలిసింది విడవకుండా ఖర్చు పద్దు. పాపం, అమెరికను కోటీశ్వరులు చాలా పెద్ద చిక్కుల్లో ఉన్నారు. యుద్ధాలు మానేస్తే వాళ్లు నాశనం అయిపోతారు!" అంటూ రాజావారు పెద్ద నిట్టూర్పు విడిచారు

***ముద్రణ : వసుధ మాసపత్రిక, మే 1971***